క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సర్పంచ్

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో గుర్రపు నారాగౌడ్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో బందనకల్ జట్టు విజయం సాధించింది. బందనకల్, ముస్తాబాద్ జట్ల మధ్య బుధవారం జరిగిన ఫైనల్ పోటీల్లో బందనకల్ జట్టు విజయం సాధించింది. ఇరవై జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో విన్నర్, రన్నర్ జట్లకు సర్పంచ్ వెంకటేశ్వరి, ఉపసర్పంచ్ కార్తీక్‌రెడ్డి ట్రోఫీ, నగదును అందించారు.

నర్మాల ప్రాజెక్టు సందర్శన



నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టును బుధవారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్ట్‌లో యాసంగి పంటలకు నీరులేదని, చివరకు పంటలు ఎండే అవకాశముందన్నారు. మండలాధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ, నాయకులు పత్తిస్వామి, రాజుగౌడ్, ఎల్లం, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు విష్ణుశ్, తదితరులు పాల్గొన్నారు.

20న గోదాం ప్రారంభం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని చెక్కపల్లిలో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను ఈనెల 20న ప్రారంభిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేటీఆర్‌కు ఇప్పుడు సర్పంచులు గుర్తుకొచ్చారా ?

ముస్తాబాద్: సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులను ఏనాడు పట్టించుకోని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు వారిపై ప్రేమ ఒలకబోస్తున్నారని సింగిల్‌విండో మాజీ చైర్మన్ చక్రాధర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ముస్తాబాద్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ సర్పంచులకు కేటీఆర్ సన్మానం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సర్పంచుల బకాయిలను సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకంగా ఇస్తారని, కేటీఆర్ ఉద్యమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. అధికారంలో ఉండగా ఎవరిని పట్టించుకోని బీఆర్‌ఎస్ మంత్రులు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు.

సైలెన్సర్లు మార్చిన రెండు బుల్లెట్ బైకులు సీజ్

తంగళ్లపల్లి: వాహనాల సైలెన్సర్లను మార్చి శబ్ద కాలుష్యానికి కారణమైన రెండు బుల్లెట్ బైక్‌లను సీజ్ చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కరీంనగర్, ఇల్లంతకుంటకు చెందిన ఒక్కో బైక్‌ను సీజ్ చేసి.. కంపెనీ సైలెన్సర్‌లను యజమానులతో తెప్పించి బిగింపజేయించినట్లు వివరించారు. కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను తొలగిస్తే బైక్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సర్పంచ్‌కు పరామర్శ



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గుండారం సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్ అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. శంకర్‌నాయక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి ఉన్నారు.

దూషించిన కేసులో మహిళకు రిమాండ్

వేములవాడరూరల్: కులంపేరుతో దూషించి దాడిచేసిన కేసులో ఓ మహిళను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ మండలం జయవరం గ్రామశివారులో మల్లారంకు చెందిన వజ్రవ్వ, జోగాపూర్‌కు చెందిన సునీత పత్తి ఏరేందుకు వెళ్లారు. పత్తి తీసేందుకు మునుము పట్టుకోగా వజ్రవ్వను సునీత కులంపేరుతో దూషించి, కర్రతో దాడిచేయగా చేతికి తీవ్ర గాయమైంది. వజ్రవ్వ ఫిర్యాదు మేరకు సునీతపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

యూరియా కొరత

- జిల్లాలో లక్ష ఎకరాల్లో వరిసాగు
- సరైన సమయంలో పంటలకు చల్లితేనే ప్రయోజనం
- ఆందోళనలో అన్నదాతలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రుద్రంగికి చెందిన ఈర్ణం నరేందర్. మూడెకరాల్లో వరి సాగు చేశాడు. నాటు వేసి నెలరోజులవుతున్నా సొసైటీలో యూరియా కోసం వారం రోజులుగా ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నాడు. ఇప్పటి వరకు యూరియా దొరక్క పోవడంతో పంటలకు చల్లే సమయం దాటుతుందని, తర్వాత చల్లినా ఏం ప్రయోజనం ఉండదని ఆందోళన చెందుతున్నాడు.



ఈఫొటోలో కనిపిస్తున్న రైతుపేరు గోనె లక్ష్మణ్ రావు. రుద్రంగికి చెందిన ఈయన ఏడెకరాల్లో వరి సాగుచేశాడు. సొసైటీ వారిని 15 రోజులుగా యూరియా కోసం అడిగితే ప్రతిరోజు రేపు మాపు వస్తుందని చెబుతున్నారు. ఇప్పటి వరకు యూరియా రాలేదని, త్వరగా యూరియా అందుబాటులో ఉంచి పంటలకు యూరియా వేసే సమయం దాటి పోకుండా చూడాలని కోరుతున్నాడు.



యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

రుద్రంగి(వేములవాడ): జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. దీంతో పంటలకు ఎరువులు చల్లే సమయం దాటిపోతుందని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో పంటలకు చీడపీడలు సోకి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపగా యాసంగిలోనైనా మంచి దిగుబడులు సాధించాలని రైతులు ముందుగానే పంటల సాగు చేశారు. అయితే సమయానికి ఎరువుల (యూరియా) కొరతతో నిరాశ చెందుతున్నారు. కష్టపడి పంటలు సాగు చేసినా సమయానికి ఎరువులు చల్లకపోవడంతో ఆశించిన మేర దిగుబడి రాదని వాపోతున్నారు.

లక్ష ఎకరాల్లో వరిసాగు..

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 1,00,721 ఎకరాల్లో వరి, 32.65 ఎకరాల్లో పెసర, 331.49 ఎకరాల్లో శనగ, 451.35 ఎకరాల్లో మొక్కజొన్న, 64.4 ఎకరాల్లో పల్లి, 127.79 ఎకరాల్లో సన్ ఫ్లవర్, 42 ఎకరాల్లో నువ్వులు, 35 ఎకరాల్లో ఆవాలు, 30.3 ఎకరాల్లో ఇతర పంటలను, మొత్తం1, 01835.98 ఎకరాల్లో పంటల సాగు చేశారు.

20వేల టన్నులు అవసరం..

అధికారుల సూచన ప్రకారం జిల్లాలో సాగు చేసిన 1,01835.98 ఎకరాల పంటలకు సుమారుగా 18వేల టన్నుల నుంచి 20వేల టన్నుల యూరియా అవసరముంది. ఇప్పటి వరకు జిల్లాలో 10 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉండగా మిగతాది రావాల్సి ఉంది. గత 15 రోజులుగా యూరియా అవసరముందని సొసైటీ పాలకవర్గాన్ని రైతులు అడిగినా సొసైటీ వారు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

పేరుకే ఎరువుల సరఫరా

సనుగుల సొసైటీ పరిధిలోని రుద్రంగికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఎరువుల సరఫరా చేస్తున్నామని గొప్పలు చెబుతున్నారే తప్ప రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో సరఫరా చేయడం లేదన్న ఆరోపణలున్నాయి.

రైతులపై అదనపు భారం..

సొసైటీలో యూరియా లేకపోవడంతో ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో బస్తా యూరియాకు సుమారు రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలతో ఇప్పటికే సాగుకు పెట్టుబడులు పెరిగి ఆదాయం వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు ఒకటి రెండు లారీల లోడ్ యూరియా వచ్చినా ఒకేసారి ఎగబడటంతో చివరి రైతులకు అందడం లేదు.

లారీల సమ్మెతో ఆలస్యం



లారీల సమ్మెతో సొసైటీకి యూరియా రావడంలో ఆలస్యమైంది. ఒకటి, రెండ్రోజుల్లో సొసైటీకి యూరియా వస్తుంది. రైతులు సహకరించాలి.

– శ్రీవర్ధన్, సీఈవో, సనుగుల సొసైటీ

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: చాకలి ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తి దాయకమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొలనూర్, మర్తనపేట, ధర్మారం గ్రామాల్లో కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొన్నారు. మర్తనపేటలో చెన్నమనేని శ్రీకుమార్‌తో కలిసి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కులసంఘాల ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నమనేని వంశీకృష్ణారావు, ఉపసర్పంచ్ పర్శరాములు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాయకులు అబ్దుల్ రషీద్, బాస్కర్, గోపాల్, ఎల్లయ్య, రుక్మిణీ, కమలాకర్, పలుగ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం భవనానికి భూమిపూజ

మండలంలోని వట్టిమల్లలో ముదిరాజ్ సంఘం భవనానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గండి నరేశ్, ఉపాధ్యక్షుడు వంకాయల శంకర్, మాజీ ఎంపీటీసీ జెట్టి అంజయ్య, మత్స్యశాఖ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, దుండిగాల శంకర్, పోచయ్య, చొక్కాల రాజు, జెట్టి నర్సయ్య, దుర్గయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్/చందుర్తి: చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన బ్యాంకు ఖాతాదారుడు నేతికుంట అనిల్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వేములవాడ గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. ఇక్కడ ఏజీఎం వంశీకృష్ణ, మేనేజర్ గజేంద్ర తదితరులున్నారు.

కరసేవకులను ఆహ్వానించండి

- ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న పిట్ల దేవయ్య



పిట్ల దేవయ్య

ఎల్లారెడ్డిపేట: అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం 1992లో ఇక్కడి నుంచి కదిలి వెళ్లిన కరసేవకులను ప్రభుత్వం మరిచిపోయిందని రాచర్లగొల్లపల్లికి చెందిన కరసేవకుడు పిట్ల దేవయ్య అన్నారు. గొల్లపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జైశ్రీరామ్ కరసేవా సమితి పిలుపుతో అయోధ్యకు 1992 డిసెంబర్ 2న గొల్లపల్లి నుంచి 27 మంది వెళ్లినట్లు తెలిపారు. నిజామాబాద్ వరకు బస్సులో అక్కడి నుంచి రైలులో అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ అయోధ్యకు చేరుకున్నట్లు తెలిపారు. రైలు దిగగానే అక్కడి పోలీసులు చుట్టుముట్టి జైలుకు తరలించారని, అక్కడే మూడు రోజుల నిర్బంధం తర్వాత విడుదల చేసినట్లు వివరించారు. జైలునుంచి నేరుగా అయోధ్యకు వెళ్లి శ్రీరామునిని దర్శించుకుని, అక్కడి మట్టిని తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. తిరుగు ప్రయాణంలో రైలులో తోటి ప్రయాణికులు ఇచ్చిన ఆహారం తిని స్వగ్రామాలకు చేరుకున్నట్లు తెలిపారు. ఇంత ధైర్య సాహసాలతో ఎలాంటి రవాణా, కమ్యూనికేషన్ అభివృద్ధి చెందని ఆ రోజుల్లో అయోధ్యకు చేరుకున్న తమకు ఈనాడు శ్రీరామ కరసేవా సమితి సభ్యులను గుర్తించి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించాలని కోరారు.



కరసేవా సమితి గుర్తింపుకార్డు

కల్వర్టు పైనుంచి జారిపడి వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామానికి చెందిన గూడ రాజిరెడ్డి(90) బుధవారం కల్వర్టు పైనుంచి జారిపడి మృతి చెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం.. వృద్ధాప్యంతో ఇంటి వద్దనే ఉంటున్న రాజిరెడ్డి నిత్యం ఉదయం గ్రామంలోని హోటల్ వద్దకు వెళ్లి కాసేపు సేదతీరి ఇంటి కొస్తుంటాడు. ఈ క్రమంలో హోటల్ నుంచి ఇంటి కొస్తుండగా రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టుపై కూర్చున్నాడు. కల్వర్టు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడగా పక్కనే ఉన్న బురదలో చిక్కుకున్నాడు. దీంతో రాజిరెడ్డి ఊపిరాడక అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుమారుడు అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మంత్రి పొన్నంపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీజేపీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని అడ్డం పెట్టుకొని మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. అందులో భాగంగానే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, అనిల్‌రెడ్డి మంత్రి మాట్లాడిన మాటలను వక్రీకరిస్తున్నారన్నారు. కేవలం వారి స్వార్థ రాజకీయాల కోసం శ్రీరామచంద్రుడిని బీజేపీ వాడుకుంటుందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు సాహెబ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రం, ఏలూరి రాజయ్య, బాబు, బుచ్చాగౌడ్, దేవయ్య, రాజేందర్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి: మండలంలోని ఎర్రగడ్డ గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సర్పంచ్ భూక్య జగ్యమాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పలువురికి ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఆడెపు భూపేందర్ రెడ్డి రైతుల రుణాల గురించి వివరించారు. సంకల్ప యాత్రలో భాగంగా ప్రతిజ్ఞ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు,అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లోని ఎల్లమ్మ తల్లిని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదీని ఈనెల 20 వరకు పొడిగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల బద్దెనపల్లి ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో రూ.200 ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 4న ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ఆయాలు లేక అవస్థలు

- ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్లుగా ఖాళీలు
- తగ్గుతున్న చిన్నారుల సంఖ్య
- ఆయాలను నియమించాలని విజ్ఞప్తి



ఆవునూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ముస్తాబాద్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తీసుకువచ్చే సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాల్లో ఆయాలు కరువయ్యారు. ఏళ్లుగా ఆయాపోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదన్న విమర్శలున్నాయి. మండలంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాపోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా కేంద్రాలకు వచ్చేపిల్లలు, బాలింతలు, గర్భిణులకు సరైన సేవలు అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాలివే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు చిన్నారులకు ఆటపాటలు చెబుతుండగా ఆయాలు చిన్నారులను ఇంటినుంచి కేంద్రాలకు తీసుకురావాలి. ఉదయం కేంద్రానికి వచ్చి శుభ్రంచేయాలి. మంచినీరు, వంటకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలి. చిన్నారులు గైర్హాజరైతే వారి ఇళ్లకు వెళ్లి తీసుకురావాలి. పిల్లలు మరుగుదొడ్లకు వెళ్తే చూసుకోవడం, వంటచేయడంతో పాటు కేంద్రంలోని ప్రతి చిన్నారికి భోజనం, గుడ్డు అందించాలి. బాలింతలకు బాక్సుల్లో భోజనాలు పెట్టాలి. అంగన్‌వాడీ టీచర్లు ఏదైనా సమావేశాలకు వెళ్లినా.. సెలవులో ఉన్నా చిన్నారుల ఆలన పాలన చూసుకోవాలి. మండలంలో ఆయాపోస్టులు ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు కేంద్రాలకు ఒకే ఆయా..

మండలంలో ఆవునూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నెంబర్ 3,4లను ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. నాలుగో కేంద్రంలో పనిచేసే ఆయ బీపాస ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటినుంచి టీచర్ శాంత నాలుగు నెలలుగా సొంతంగా వేతనాలు ఇచ్చి ఆయాను పెట్టుకుంది. ఇటీవలే 3 నెంబర్ కేంద్రం ఆయాకు 4వ కేంద్రం బాధ్యతలు అప్పగించారు. అలాగే గూడెంలో అంగన్‌వాడీ కేంద్రం 2లో నాలుగేళ్లుగా ఆయాపోస్టు ఖాళీగా వుంది. ఇక్కడ టీచరే మూడేళ్లుగా నెలానెలా వేతనాలు చెల్లిస్తూ ఆయాను పెట్టుకుంది. నాలుగు నెలలక్రితం ఎంపికైన ఆయా జాయిన్ కాకపోవడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. తుర్కపల్లి, కొండాపూర్, పోతుగల్ కేంద్రాల్లోనూ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నా యి. ఇటీవలే అప్‌గ్రేడ్ అయిన సేవాలాల్‌తండా మినీ కేంద్రంలోనూ ఆయా పోస్టును ఇప్పటివరకు భర్తీ చేయలేదు. మండలంలో ఆరు పోస్టులు ఖాళీగా ఉండగా కేంద్రాల నిర్వహణ టీచర్లు, ఇన్‌చార్జిలకు భారంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతున్నారు. కాగా ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే ఆయాలకు రిటైర్మెంట్ వయసు నిర్ధారించలేదు. ఆరునెలల క్రితం గత ప్రభుత్వం 65 సంవత్సరాలు నిర్ణయించగా వారికి రిటైర్మెంట్ వయస్సు ఉంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 సంవత్సరాలకు పైబడిన వారు సైతం ఆయాలుగా పనిచేశారు.

ఏడాదిగా ఆయా పోస్టు ఖాళీ



అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే ఆయా ఏడాది క్రితం మృతిచెందింది. కొద్దిరోజులు స్వయంగా వేతనాలు ఇచ్చి భోజనం తయారు చేయించా. అధికారుల ఆదేశాలతో ఇక్కడే పనిచేసే మరోకేంద్రం ఆయాకు బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ ఆయాను నియమించాలి.

– బోయిని శాంత, టీచర్, ఆవునూర్

రెండు కేంద్రాలు చూస్తున్న



రెండు కేంద్రాలు నేనే చూసుకుంటున్న. పిల్లల్ని కేంద్రాలకు తీసుకురావడం, వంట చేయడం ఇబ్బంది అవుతుంది. మరుగుదొడ్లకు వెళ్లే పిల్లల్ని చూడడం కష్టమవుతోంది. గర్భిణులు, బాలింతలకు భోజనం అందిస్తున్నా అన్ని పనులు నేనే చేస్తున్నా

– ఎర్రుల సాలవ్వ, ఆయా

ఉన్నతాధికారులకు నివేదించాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయాపోస్టుల వివరాలను ఉన్నతాధికారులకు అందించాం. కొన్ని కేంద్రాల్లో టీచర్లే వేతనాలు ఇవ్వడం భారమవుతోంది. ఆయాలు లేని కేంద్రాల్లో హాజరుశాతం తగ్గుతోంది.

– కళావతి, సూపర్‌వైజర్

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండలంలోని నిమ్మపల్లి (గొల్లపల్లి)కి చెందిన చెకుట దేవయ్య గత సెప్టెంబర్‌లో మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి, ఆరునెలల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ మూలవాగునుంచి ఇసుక తరలిస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.50 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బైండోవర్ నిబంధనలు పాటించాలని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పోలీసుల పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తులపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పోలీసుల పేరుచెప్పి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఒకరిని అరెస్టు చేసి, మిగతా వారిని విచారిస్తున్నట్లు సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం మాట్లాడారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో వేబిల్లులు చూపించని మూడు ట్రాక్టర్లను ఈనెల 12న పోలీసులు ఠాణాకు తరలించారు. ఇదే అదనుగా భావించిన తంగళ్లపల్లికి చెందిన అక్కపల్లి ఎల్లారెడ్డి అనే వ్యక్తి సీజ్‌చేసిన ట్రాక్టర్ యజమాని సూర వెంకటరమణను పోలీసుల పేరుచెప్పి బెదిరించి బలవంతంగా రూ.13వేలు వసూలు చేసి సొంతానికి వాడుకున్నాడు. బాధితుడు వెంకటరమణ ఫిర్యాదుతో అక్కపెల్లి ఎల్లారెడ్డిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. మరికొందరిని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ముస్తాబాద్: తెర్లుమద్దికి చెందిన పెద్ద నర్సాగౌడ్ (38) అనే గీత కార్మికుడు బుధవారం తాటిచెట్టుపై నుంచి పడగా గాయాలయ్యాయి. నర్సాగౌడ్ కల్లు గీసేందుకు తాటిచెట్టుఎక్కగా మోకు జారి కిందపడిపోయాడు. చికిత్సకోసం సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.